# మేడమెట్లు

అతడు ఏదో ఆలోచించుకొంటూ పరధ్యాన్నంగా వున్నాడు. ఏదో కులాసా అయిన ఆలోచనే అయివుంటుంది. అందికే తన్ను తాను కొంతవరకూ మరచినట్టు వున్నాడు. ఈలా ఆలోచిస్తూండగానే కిందనించి స్నానానికి రమ్మని పిలుపు వచ్చింది.

అంచేత తువ్వాలు కప్పుగొని ఆలోచిస్తూనే మేడమీద నుండి దిగబోతున్నాడు. ఆమెట్లు అతనికి క్రొత్త అని జ్ఞాపకం లేదు. ఆలోచనలో వుండడం చేత జాగ్రత్తలేదు. ఆ ద్వారానికిన్ని మెట్లకిన్ని ఎత్తు చాలా లావుగా వుంది. అడుగు బారెడు క్రిందికి వేస్తేనేగాని మెట్టు అందదు. కాని...

అతడు ఆలోచిస్తూనే...తేలికగా మెట్లమీద మనసు వుంచకుండా, కూనిరాగం ఉల్లాసంగా తీస్తూ, కాలుని అతిచులాగ్గా గుమ్మం దించేడు... ఇంకేముంది! అది లోతుగా వుండడంచేత...ఊహించినట్టు కాలుకి, మెట్టు తగలేదు. ఇంతలో శరీరం ముందుకి తోసుకువచ్చేయడం, గరిమనాభి తప్పడం జరిగింది. ఒక్కసారి శరీరం బరువంతా ఆ ఎత్తిన పాదం మీదపడింది. పాదం ఒక్క వూపున మెట్టుమీద బరువుగా పడి 'ఛన్' మని శబ్దం అయింది. ఆ శక్తికి త్రోపుకి శరీరంముందుకి త్రోయబడింది. పడిపోకండా ఆపుకొనేందుకని...అతడు అటూఇటూ, చేతులు చాపి జోరుగా పరుగెట్టవలసి వచ్చింది.

ఇక చూడండి కాళ్ళు లొట్టిపిట్ట కాళ్ళలా రెండేసి మెట్లు మూడేసి మెట్లు, గాలిలో దాటిపోతూ ఆ మూలనుండి ఈ మూలకి ఈ మూలనుంచి ఆ మూలకి కేరంబోర్డులో పిక్కలా తృళ్ళి, జారి, ఆఖరికి-గోలులో బంతి పడినట్టు క్రిందకి వచ్చి పడ్డాడు.

ఈ పడ్డంలో అదృష్టవశాత్తూ దొర్లిపోలేదు. ఇదంతాకాళ్ళమీదే జరిగింది. ఆ వూపుకి...మెట్ల ఆఖర్ని మాత్రం, మొఖం జూమాలుమని, గుండె కొట్టుకొని కింద చతకిలపడిపోయి చూస్తూ ఊరు కున్నాడు.

అత్తగారు, బావమరదులు, అందరూ...అంతవరకూ కిందనుండి సర్కసులో మీదనిపనులు చేస్తూంటే కిందని ఒక వేళపడితే కాసేవారి లాగ, చేతులుచాపి నిలబడడం తప్పిస్తే ఏం చేయలేం పోయినారు.

ప్రమాదంగాని, దెబ్బలుగాని లేకుండా క్రింతకి క్షేమంగా వచ్చిన అల్లుణ్ని, అతని వైఖరిని చూసేసరికి వీళ్ళందరికీ కడుపుపట్టలేనంత నవ్వు వచ్చింది. పక్కుమని అందరూ నవ్వేశారు.

అతని భార్య మాత్రం 'చాలు వూరుకోండి' అని అందర్ని అనేసి లేవనెత్తింది.

"కాళ్ళు కడుక్కుందికి, కాళ్ళు ఏమన్నా మిగిలేయా? బావా? వడ్డించేరు?" అని ఎగతాళి చేసేడు బావమరిది...

"వేడినీళ్ళు తొల్లించేను! నూనె రాసుకుపోసుకో నొప్పులు తగ్గుతాయి. పోతేపోయిందిలే మెట్ల ఓడిపోయాయి పాపం!" అని నవ్వుతూ అంది మరదలు—

"గట్టిగా తగల్లేదుకద ఇంకా నయం, ఈరోజు ఎవరి మొహం చూశాడో!" అంది అత్తగారు.

ఈ అవమానాలతో కూడిన పరిహాసాలు అతగాడికి సగం చచ్చినట్టయింది. ఏడవలేక నవ్వుతూ 'ఈ మాత్రమయినా వుంచేవు భగవంతుడా!' అని అనుకొంటూ, మారు మాటాడకుండా స్నానాల గదిలోకి పోయేడు.

ఇక్కడితో అయిందా! ఈ పడడంలో—ఎవరూ ఊహించని, మరో విషయం జరిగింది. అదేమిటీ అనగా-పెద్దశబ్దం...బాంబులు పడిన లాటి శబ్దం. ఆ వెధవ మెట్లు కర్రమెట్లు-ఎంత తాపీగా అడుగు వేసినా దుబ్బు దుబ్బు మని డోలులా చప్పుడు. అటువంటిది ఇంత తాండవం జరిగితే...ఏమవుతుంది?...అవి చుట్టు ప్రక్కల చాలా దూరంవరకూ ఆ శబ్దాన్ని ప్రచారం చేశాయి. ఇది ఎవరూ గుర్తించలేదు...

కాని...అ కర్రమెట్లు—మేడమెట్లు— ఆ సమయంలో వాటి బాధ ఎవరితో చెప్పుకున్నాయోగాని ఈయన చేసిన ఆ నృత్యానికి నొచ్చుకున్నాయి. తాళలేక అల్లలాడిపోయినాయి.అందుకే గొంతెత్తి అరిచేయి—వాటికి కోపం వచ్చి ఏదో ఒకటి చెయ్యాలని అనుకున్నాయి అంతేలే...

కాని వెధవ కర్రముక్కలు వాటి బుద్ధి మానవులముందా? ఏనాడయితే, ప్రాయశ్చిత్తం అయిందో, ఆ నిమిషం నుండి అతడు అతి జాగ్రత్తపడ్డాడు. విక్రమార్కుని సింహాసనం ఎక్కేప్పుడెంత జాగ్రత్త పడేవాడో అంత జాగ్రత్త తీసుకునేవాడు. అయితేనేం ఆ వెధవశబ్దం మాత్రం పోయేదికాదు. అడుగు ఎంత మెల్లిగా వేసినా చప్పుడు మాత్రం పూరంతా అయి మీద దాబావల్ల ప్రతిధ్వనించి కొండంత అయ్యేది ఆ శబ్దం. మెట్లకూ తనకూ అంత విరోధం వచ్చినా ఎన్నాళ్ళు? సంబంధం మాత్రం తప్పనిసరి మెట్ల అవసరం తనకుంది. అంచేత తెగ తెంపులు చేసుకోవడం జరగని పని. అంచేత సఖ్యత చేసుకోవడం మంచిది, అంచేత అతడు, అదంతా మరచి యథా ప్రకారంగానే నడవడం మొదలెట్టేడు కూడ. వాటిమీద అంతకక్ష వుంచలేకపోయినాడు.

భోజనానికి రమ్మని పిలవగా, కొంచం ఆలస్యంగా వెళ్ళేడు. వెళ్ళగా అక్కడ ఇంతకు ముందు నుండే ఒక ప్రసంగం జరుగుతూ వుంది. బావమరిది అంటున్నాడు.

"అదెవర్తి మన ఇల్లు, మనఇష్టం! దానికేం? అదెవరు అడగ దానికి? అయినా మనమేం నోరుండి చప్పుడు చేశామా?" అని అన్నాడు.

"అదికాదురా? అది అలాటిది, దానితో మనకెందుకు? మునుపు కూడ రెండుసార్లు ఇలాగే కబురంపింది. పోనీ అంతలా ఏడుస్తున్నపుడు మనం జాగ్రత్తపడితే తప్పేముంది?" అని అంది అత్తగారు.

అదేమిటో అర్థంగాక

"ఏమిటి సంగతి" అంటూ పీటమీద కూర్చున్నాడు అతగాడు— అనగా అల్లుడు.

"అబ్బే ఏం లేదులే" అని అంది అత్తగారు నెయ్యివేస్తూ.

"ఇక్కడో సుకుమారి వుందిలే. ఈ ప్రక్క ఇంటిలో మొన్న నువ్వు-ఎందుకులే!" అని అర్థోక్తిలో, నొక్కి బావమరిది వూరుకొనేసరికి— అతగాడి గుండె కొట్టుకుంది.

"అదేమిటి? సుకుమారి ఏమిటి?...నేను... ఏమిటి? నేనెవరినీ చూడలేదే! ఏ సుకుమారితోనీ సంబంధం ఇంకా ఏర్పడలేదే? అలా గయితే బాగా వుండునేమో" అని బెంగ పెట్టుకున్నాడు.

"అదేమిటోయి! అపోహాస్త్రం వదిలేసి అలా వూరుకున్నావు మీ అక్కయ్యకూడా వుండెను, విడాకులివ్వకుండా బాధ పెడుతుంది."

"ఎంత ఒణుకండీ! ఎంత భయం...అందులోనూ నా దగ్గరేనా"

"అలాంటిదేం కాదులే ఈ ప్రక్కనే ఒకామె వుంది. స్కూలు టీచరు. ఒక్కర్తే వుంది-మొన్న నువ్వు-మెట్లతో సరసమాడేవే... అందులో ఆ మెట్ల గొంతుకే కొంచెం ఎక్కువ అయి, ఆమెని బాధ పెట్టి వదిలేసేయి. అంచేత ఫిర్యాదు చేసింది" అని చెప్పేడు బావమరిది.

"ఏమని" అడిగేడు అతను.

"అంత జోరుగా నడవడం ఏమిటీ? అంత చప్పుడు చేయడం ఏమిటీ? ఇరుగు పొరుగు వాళ్ళకి విశ్రాంతి అక్కర్లేదా?" అని.

"చాలా బావుంది ఫిర్యాదు" అని అన్నాడు విసుపోయి అతడు.

"కాదోయ్! దానికేదో సంకటం వుంది కాబోలు—మేడ మెట్లు చప్పుడు వింటే దానికి గుండె దడట! అలా వుండిపోయి మరి లేవ

లేదట! అంచేత కొంచెం గట్టిగా మేడమెట్లు చప్పుడయితే కబుర్లు పంపి స్తుంది! అలా చెయ్యొద్దని!" అన్నది అత్తగారు మజ్జిగపోస్తూ.

అయితే ఇది తొలిసారి కాదన్నమాట, కాబట్టి తను కారణ మాత్రుడు కాడు అని నిబ్బరపడ్డాడు అతడు.

"అవును! నిద్రపోయిందేమోను అంత శబ్దం అయితే భయపడి వుంటుంది" అని పైకి అన్నాడు.

"కాదు కాదు! దానికి ఇంత శబ్దం అవనక్కర్లేదు. మేడమెట్లు చప్పుడయితే చాలు! అది దిగినపుడు అయినా బాధలేదు!" అని అన్నాడు బావమరిది.

"చాలా వింతగా వుందే!" అని అన్నాడు అతడు చేయి కడుక్కొని తుడుచుకుంటూ.

"మెట్లెక్కకుండా ఎలా చావడం ఎగిరిపోలేం కదా? మెట్లెక్కితే చప్పుడవక మానునా?. అంతే ఏం చేస్తాం, దానిగోల దానిది, మనపని మనది!" అని ఆఖరికి తేల్చేసేరు.

అతడు మాత్రం ఆలోచనని దూరం చేయలేకపోయినాడు. ఎందుకంటే అతను ఎలాగో పొరపాటయి పడ్డాడు, ఆ అవమానాన్ని తను మరిచిపోదామని ప్రయత్నిస్తున్నాడు, అందరూ కూడా మరిచి పోవాలని అనుకుంటున్నాడు. కాని, ఈ విధంగా, ఆ సంఘటన మాసి పోకుండా సాగుతూంది. అందుకే ఆలోచన పట్టుకుంది.

"ఒక ఇంటిమీద, మరొక ఇంటి వారికి అంత స్వాతంత్రం ఏమిటి? ఎవరింట్లో వారు వారిష్టం వచ్చినట్టు ఉంటారు అది వారి వారి ఇష్టం, అందులో పొరుగింటివారి ప్రసక్తి ఏమి! వాళ్ళెవరు? అంతగా ఇబ్బంది అయితే, సహించలేకపోతే—వీలయితే అనుభవించాలి లేదా అక్కడనుండి పోవాలి! అంతేగాని ఆమాత్రం దానికి, మీదకొచ్చి పడ తారా! అయినా ఏమిటంత సహించరాని, క్రమ విరుద్ధమయిన పని జరిగిపోయింది? ఏమీలేదు, ఒక్కసారి పెద్దశబ్దం అయింది. అదీ

కేవలం, దైవికం. తను కొత్తగా అక్కడికి రావడంచేత పడ్డాడు— పెద్ద శబ్దం అయిందని ఒప్పుకుంటాడు—ఆమె భయపడ వచ్చును. అయితే మాత్రం? ఎప్పుడూ అలాగే పడతారా? అలాగే చప్పుడవుతుందా? ఒక్కసారికి అలా చెయ్యవద్దని కబురంపాలా? అంపడానికి ఆమె కేమిటా స్వతంత్రం? ఏమిటా హక్కు? ధైర్యం? అధికారం?"—

అతనికేమీ అర్థంకాలేదు, జవాబు లభించలేదు. కాని ఒక విషయం నిజం— అకస్మాత్తుగా పెద్దశబ్దం వింటే ఎవరికయినా గుండె దడ కొట్టవచ్చును. అది తాత్కాలికంగాని ఆమెకి చప్పుడయితే భయంగాదు. ఆమెకి మేడమెట్ల చప్పుడు— మేడ మెట్లమీద అడుగుల చప్పుడు — వింటేనే భయం— అని బావమరిది వాళ్ళు చెప్పేరు. ఇదే నిజంకావచ్చు. అదేగాని నిజం అయితే దానికేదో కారణం వుండాలి!— ఏమిటయి వుంటుంది!

ఆమె వయస్సు భోగట్టాచెయ్యగా యీడుమించినదికాదని, చిన్నదే అని తెలిసింది. అంతటితో ఆలోచన ఆగిందా ఆతృత ఆగిందా? లేదు. ఆమె ఒంటరిగా ఎందుకుంది? ఎవరూ లేరా? దానికి కారణం ఏమిటి? ఏ ప్రదేశాలది? ఇల్లాంటి సందేహాలన్నీ కలిగేయి... కాని తనకెందుకు? ఏదో ఆడది— ఒంటరిగా వుంది— కాబట్టి అకస్మాత్తుగా మెట్లు చప్పుడయితే ఎవరో తన మేడమెట్లు ఎక్కి తన దగ్గరకే వస్తున్నట్టు— అనుమానించుగొని, లేక—అనిపించి, భయపడుతూందేమో! దానికోసం ఇంత సాగదీసుకోవడం ఎందుకు? యీ విధంగా సామాన్యంగా భావించి వూరుకోలేక పోయినాడు.

ఆమె విషయం తనకి అనవసరం, తెలుసుకోవాలనివున్నా లాభం లేదు. ఎందుకంటే అక్కడున్న వారెవరికీ ఆమె విషయాలు తెలియవు. ఇందుకు ఒక కారణం—

మర్యాదగా, గొప్పగా, బ్రతుకుతున్నామనుకొని కాస్త అంతస్తు, హోదాలో, వున్నవారికి — గొప్పవారని, డబ్బున్న వారని, సంస్కారణ, నాగరికత గలవారని, అధికారంగలవారని, అనుకుంటున్న

వారికి- ఒకరి జోక్యం, కలుగజేసికోవడం- అంటే, అదొక చిన్నదనం- ఒకరి విషయాలు అడగడం, తెలుసుకోవడం అన్నవి,పనికిరాదు, పొరుగు యిరుగువారి గురించి అయినా, వారెవరు? ఎక్కడివారు? వారికెవరైనా వున్నారో లేరో? ఎలాటి వారు? ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారు? యిత్యాది, పుట్టుపూర్వోత్తరాలు, అడిగి తెలుసుకోవడంగాని, అందుకు ప్రయత్నించడంగాని చేసినట్టయిన- అది అనాగరికత అనిపించుకుంటుంది. వారి తాహతుకి తక్కువ, మర్యాదకి భంగం. అలా ముభావంగా ఎవరి హద్దుల్లో వారు ఓహో! అంటే ఓహో! అనిపించుకుంటూండడమే వారికి నాగరికత లక్షణం. అవన్నీ అనవసరం కింద లెక్క... కాని, ఇదంతా బయట ప్రచారంకోసమేగాని చాటుగా ఎన్ని తెలుసుకున్నా తెలుసుకుందికి ప్రయత్నించినా పరవాలేదు బయటికి మాత్రం పెద్దమనుషుల్లా, చెల్లిపోతూంటే చాలు. అంచేత అతడుకూడ మనకెందుకని వూరుకోడం మంచిదనుకున్నాడు. కాని అతనికి ఈ మేడ మెట్లు ఈపాటి దాని కింత ప్రాముఖ్యం ఎందుకొస్తూంది" అని ఆశ్చర్యం కలిగింది.

ఇంక ఆ మర్నాడు బయలుదేరి వెళ్ళిపోతాడనగా చిన్న అనుకోని సంఘటన, అతనికీ, ఆ మేడ మెట్లకీ జరిగింది. ఆ మెట్లకీ, అడనికీ, ఎందుకంత కిట్టకండాపోయిందో అర్థంకాలేదు. వచ్చిన దగ్గర్నుంచి, ఏదో ఒకటి, అవుతూనేవుంది. ఏదీలేదని అనుకున్ననాడు, కాలుకో వేలుకో దేనికోదానికి ఏదో మెట్టు తగులుకొని తీపుతుంది.— ఎక్కినపుడూ దిగినపుడూ గూడ ఇరువురూ జ్ఞాపకం- వుంచుగొనే వుంటారు.

సాయంత్రం మూడు గంటలకి ముస్తాబయి సూటు, బూటు, ధరించి సిగరెట్టు టిన్ను చేత్తోపుచ్చుకుని షికారుకని మెట్లు మెల్లిగా దిగుతున్నాడు. ఒక సిగరెట్ పెదమలకి అంటించి, చేతితో డబ్బా, పట్టుగొనే వ్రేళ్ళతో అగ్గిపెట్టెను అంటించబోయేసరికి- పట్టుతప్పి, డబ్బా మెట్లమీద పడింది. మూత విడిపోయి సిగరెట్లు అన్నీ పాచిక పిక్కల్లాగ మెట్లమీంచి దొర్లి, విరజిమ్ముకుపోయినాయి. వాటిని ఏరుదామన్న తొందరలో గబగబా అడుగులు వేసేడు ... అలా బరువుగా అడుగులు వేయడం

మూలాన్ని, మేడమెట్లకి బాధ అనిపించి, ధన్‌ధన్‌మని పిడుగులు పడ్డట్టు శబ్దంచేసి ప్రక్కనున్న మేష్టరమ్మకి ఎక్కడలేని కోపం తెప్పించి వేసేయి.

అతడు చెల్లాచెదరయిన సిగరెట్లని ఏరుతూ డబ్బీలో దూరుస్తున్నాడు వంగుని అంతలో— చర్రుని వచ్చింది మేష్టరమ్మ. వంగుని వుండడంవల్ల అతడు గమనించలేదు. ఆమె చూస్తూనే—

"ఏఁవండి! ఎన్నిసార్లు నోరువిడిచి చెప్పడం! అంత చప్పుడు చేయొద్దని! నన్ను బ్రతకనివ్వరా? అయినా ఇంత న్యూసెన్సా! కబురంపిసే ఖాతరుచేయలేదు. ఇంక స్వయంగా వస్తేనేగాని మర్యాద దక్కలేదు!" అని వణ్ణస్తూ కోపంతో అంది. కాని ఆ సమయానికి మరెవరూ అక్కడలేరు కాని, అతడొక్కడే వంగుని సిగరెట్లని తీసుకున్నాడు, ఆమె ఆ ఉద్రేకంలో అతడికే ఉద్దేశించి "మిష్టర్!" అని ఇంకా ఏమో చెప్పబోతూండగా అతడు, వింతగా లేచి ఆమె ముఖం చూచేడు. ఆమె అతని ముఖం చూచింది... అంతే—

ఆమె నోటంట మరి మాటలేదు. ఒక్క ఘడియ కొయ్య అయినట్టయి కరక్కున ఒరిగి వెళ్ళిపోయింది. ఆమె స్వరంలోనూ ఏదో మార్పు కలిగింది దెబ్బతిన్న మనస్తత్వంతో వున్నట్టు ముఖంపెట్టి వెళ్ళిపోయింది.

ఇక అతడో! ఎత్తిన ముఖం మరికొంతసేపు వరకూ దించలేదు! నిశ్చేష్టుడైపోయినాడు.

మనసు పీడించగా, ప్రయత్నించినా అరికట్టలేక— ఆ మర్నాడు ఉదయాన్నే ఎవరికీ తెలియకుండా, ప్రక్క యింటిపైపుకి వెళ్ళాడు, వెళ్ళి మెల్లిగా మెట్లపై నుండి మీదకుపోయాడు! అతడు గమనించకపోయినా ఆ మెట్లుకూడా చప్పుడుచేస్తున్నాయి. మీదకువెళ్ళి ఆత్రంగా చూచేడు... ఏముంది? తలుపు తాళం వేసివుంది!

యింతలోనే కిందనుండి—

"ఎవరికోసం బాబూ!" అని ఒక బంట్రోత్తు అడిగేడు.

"యిక్కడ..." అని సగం చెప్పబోతూండగానే—

"కాళీచేసి వెళ్ళిపోనారండి!" అన్నాడు.

"ఎప్పుడు?" అని అడిగేడు.

"నిన్న సాయంత్రం చీకటి పడకండానే వెళ్ళిపోనారండి. చికాగ్గా ఎంత వేగిరం ఎల్లిపోదామా అన్నట్టున్నారండి!" అని అన్నాడు ఆ బంట్రోత్తు.

"అలాగా" అని జవాబిచ్చి ఆలోచిస్తూండగా—

"ప్రక్కనున్న బాబుగారికి ఓ చీటి యిచ్చేరండి యీయమని. అంతకుమించి ఏం చెప్పనేదు!" అన్నాడు వాడు సందేహిస్తూ.

అతడు ఆశ్చర్యపోయేడు.

"ఏది తే, నేనే అతడిని, ఎక్కడ?" అని గబగబా అడిగేడు.

వాడు తీసి ఒక కవరిచ్చేడు. అది తొందరగా, వణుకుతూ చించి, లోపల కాగితం చదివేడు...

అది చదివేక...యింతకు పూర్వం అతనిని చూసినపుడామె ఎటువంటి దెబ్బతిన్న మనస్తత్వంగల మార్పు చెందిందో, యిప్పుడితను అంతకు కోటి రెట్లు మార్పుచెందేడు.

ఆమె పేరూ తెలిసింది. ఆమె ఎవరో తెలిసింది. ఆమె ఎందుకు మేడమెట్లు చప్పుడుకి భయపడుతున్నదో తెలిసింది. తనని చూసి, కాళీ చేసి ఎందుకు అంత వెంటనే వెళ్ళిపోయిందోకూడ అతనికి తెలిసింది. అవన్నీ తలుచుకొని, ఆలోచించుకొంటూ మేడమెట్లు దిగిపోయినాడు.

—0—